క్లుప్తంగా

బాల్య వివాహాలపై అవగాహన అవసరం

సీడీపీఓ అనూరాధ



పిడుగురాళ్లరూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో సెక్షన్ 7, విద్య, ఓపెన్ స్కూలింగ్ ప్రాముఖ్యం, కిశోర బాలికల అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ అనూరాధ మాట్లాడుతూ... కిశోర బాలికలకు వ్యక్తిగత శుభ్రత తప్పనిసరిగా పాటించాలని కోరారు. చిన్న తనంలోనే వివాహాలు జరిగితే జరిగే నష్టాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అంజలి, ప్రసన్న, నాగమణి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



గురజాల రూరల్: వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన వి.అమరారెడ్డి సన్మాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. అమరారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కె.బుజ్జి, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, నాయకులు కె.అంద్రెయ్య, వేముల చలమయ్య, కొమ్మినేని రవిశంకర్, పోలా సతీష్, పరిమి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయంలో పేదలకు అన్నదానం



విజయపురిసౌత్: స్థానిక దేశవరపు క్యాంపు తండాలోని సేవాలాల్ మహరాజ్ ఆలయంలో శుక్రవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఇరిగేషన్ డీఈ మురళీధర్ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాత్లావత్ రాంచంద్ నాయక్ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం సేవాలాల్ ఆలయంలో పేదలకు అన్నదానం నిర్వహించడం అభినందనీయం అన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నరసరావుపేటటౌన్: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు నాయక్ శుక్రవారం తెలిపారు. రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని సాతులూరు రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ శ్రీనివాసరావు నాయక్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం పడి ఉన్న ఆనవాళ్లను బట్టి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఆకుపచ్చ రంగు అర చేతులు చొక్కా, నలుపు రంగు నైట్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి చేతి మీద నాన్న అనే పచ్చ బొట్టు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని నరసరావుపేట గవర్నమెంట్ హాస్పిటల్ మార్చురీ రూంలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నరసరావుపేట రైల్వే పోలీస్‌లను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

నరసరావుపేటటౌన్: ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి గుంటూరు రోడ్డులో నిల్చొని ఉండగా రాత్రి 11.30 గంటల సమయంలో గుంటూరు నుంచి శ్రీశైలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడిని 108 సహాయంతో ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. సమాచారం అందుకున్న టౌటౌన్ సీఐ హైమారావు శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం చోటు చేసుకుందని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

పల్నాడుపై కూటమి కుట్రలు

- వైఎస్సార్ సీపీ కార్యకర్తలే లక్ష్యంగా దాడులు
- పట్టించుకుని పోలీసులు

గురజాల: పల్నాడుపై కూటమి కుట్ర చేస్తోంది. అలజడులు సృష్టించడమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సానుభూతిపరులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకున్నారు. భౌతిక దాడులు, ఇళ్లపై దాడులు మూకదాడులు చేస్తూ ఆటవిక పాలనను గుర్తుచేస్తున్నారు. ప్రధానంగా గురజాల నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో పరిస్థితి రోజు రోజుకు పరిస్థితి తీసికట్టుగా మారుతుంది. వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమంగా కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారు.

దాడులకు తెగబడుతూ....

పిడుగురాళ్ల పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన ఇర్లా శివ, ఇర్లా శ్రీనివాసరావు, పిడుగురాళ్ల మండలంలోని కామేపల్లికి చెందిన పిచ్చిరెడ్డి, బ్రాహ్మణపల్లికి చెందిన పి.శ్రీనివాసరావు, అగ్రహారానికి చెందిన కృష్ణ, జూలకల్లుకు చెందిన లక్ష్మారెడ్డి, పాశం చిన అంజిరెడ్డి, నర్రెడ్డి వెంకటరెడ్డి, దాచేపల్లి మండలంలో వి.హనుమంతరావు, చిరంజీవి, పెద సైదాలపై దాడులు చేశారు. మాచవరం మండలంలోని పిన్నెల్లిలో పలువురిపై దాడులు చేసి, అక్రమంగా కేసులు బనాయించి స్టేషన్‌లో ఇబ్బందులు పెట్టారు. ఇబ్బడిముబ్బడిగా కేసులు పెట్టి వేధిస్తున్నారు. అనుకూలంగా పనిచేయని పోలీసులను బలవంతంగా బదిలీలు చేయిస్తున్నారంటే అణిచివేత చర్యలు ఎంత తీవ్రంగా ఉన్నాయో ఇట్టే తెలిసిపోతుంది. కప్పం కడితేనే కంపెనీలు నడిచేలా కూటమి నేతలు ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. దాచేపల్లి మండలంలో ఫ్యాక్టరీలు మూతపడటంతో ఎంతో మంది కార్మికుల ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది.



గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు

అధికారం శాశ్వతం కాదు

అధికారం శాశ్వతం కాదు అన్న విషయాన్ని కూటమి నాయకులు గుర్తుపెట్టుకోవాలి. ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలే కానీ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు చేయడం సరికాదు. లేని పోని కేసులు బనాయిస్తే మళ్లీ మేము అధికారంలోకి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలి. పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి. పోలీసులు పచ్చ చొక్కా ధరించిన నాయకులు లాగా పనిచేస్తున్నారు.

–కాసు మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, గురజాల

గిరిజన యువత క్రీడలు, చదువుల్లో రాణించాలి

వెల్దుర్తి: క్రీడల వలన దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందని గిరిజన విద్యార్థి సమైఖ్య జాతీయ అధ్యక్షులు శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పిచ్చయ్య బావితండాలో శాలిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాచర్ల నియోజకవర్గ స్థాయి గిరిజన క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంత గిరిజన యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ఆటలపై ఆసక్తిని కల్పించాలని పది రోజులుగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించటం జరిగిందన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు పెద మల్లుస్వామి, గిరిజన ప్రజా సమైఖ్య జాతీయ నాయకుడు నూన్సావత్ రంగా నాయక్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు హనుమంతునాయక్, భూక్యానాయక్, రమావత్ హనుమంతునాయక్, బద్దూ నాయక్, చంద్రూ నాయక్, కొండా నాయక్ పాల్గొన్నారు.



క్రీడల్లో విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఎన్‌కౌంటర్ మృతుల మృతదేహాలు బంధువులకు అప్పగించాలి

ప్రజాసంఘాల నాయకుల వినతి

నరసరావుపేట: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన 27 మంది మావోయిస్టులు మృతదేహాలను వెంటనే బంధువులకు ఇవ్వాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరురోడ్డులో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు నల్లపాటి రామారావు, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న, ఆర్టీఐ కార్యకర్త వసంతరావు పాల్గొని ప్లకార్డులను ప్రదర్శించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మృతదేహాలను బంధువులకు ఇవ్వకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకోవడం సమంజసం కాదని అన్నారు. వెంటనే వాటిని వారి బంధువులకి ఇవ్వాలని ప్రభుత్వాలను కోరుతున్నామన్నారు. శాంతి చర్చలకు సిద్ధమని కాల్పుల విరమణ ప్రకటించిన మావోయిస్టు అగ్ర నాయకుడు నంబాల కేశవరావు, జంగు పత్రిక ఎడిటర్ సజ్జ నాగేశ్వరరావులను కేంద్ర, రాష్ట్ర బలగాలు కాల్చి చంపటం జరిగిందన్నారు. వారితో చర్చలు నిర్వహించి ప్రతిపాదిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు ఈ రకంగా వ్యవహరించటం సరైన విధానం కాదన్నారు. దీనికి ముగింపు పలకాలని, శాంతి చర్చలే పరిష్కారమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజా సంఘాలుగా తెలియజేస్తున్నామన్నారు. చనిపోయిన వ్యక్తుల శవాలను సకాలంలో ఇచ్చి వారి పద్ధతుల్లో వారికి అంత్యక్రియలు నిర్వహించునే అవకాశం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా మంత్రి అచ్చం నాయుడు శ్రీకాకుళం జిల్లా ఎస్పీ ద్వారా కేశవరావు కుటుంబ సభ్యుల్ని బెదిరించడం మానుకోవాలని కోరారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వచ్చే ఐదేళ్లలో రూ.వంద కోట్ల రుణాలు ఇస్తాం

విశాఖపట్టణం కో ఆపరేటివ్ బ్యాంకు సభ్యుల మహాసభ నిర్వాహణ

నరసరావుపేట: రానున్న అయిదేళ్లలో విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో రూ.100 కోట్లు రుణాలను అందచేయనున్నట్లు బ్యాంక్ డైరెక్టర్ జేవీ సత్యనారాయణమూర్తి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక జీఎల్ఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన బ్యాంక్ సభ్యుల మహాసభకు బ్యాంక్ వైస్ చైర్మన్ రాఘవరావు అధ్యక్షత వహించారు. మూర్తి మాట్లాడుతూ నరసరావుపేట బ్రాంచ్ నుంచి ఇప్పటివరకు రూ.5కోట్లు రుణాలను అందచేశామన్నారు. రూ.3.72కోట్లు డిపాజిట్లుగా వచ్చాయన్నారు. ఒక పెద్ద సంస్థ రూ.2 కోట్లు డిపాజిట్ చేసిందని, అయితే ఈ బ్రాంచ్ పరిధిలో రూ.1.72 కోట్లు మాత్రమే డిపాజిట్ల రూపంలో సేకరించామన్నారు. అలాగే 44 శాతం బంగారంపై రుణాలను నరసరావుపేట బ్రాంచ్ ద్వారా అందజేశామన్నారు. డైలీ డిపాజిట్ల సేకరణ, రుణాల వసూళ్లు ఈ బ్రాంచ్ పరిధిలో సంతృప్తిగా ఉన్నాయన్నారు. ఇప్పటివరకు తమ బ్యాంకులో 1.11 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఈ ఆర్థిక ఏడాదిలో మొండిబకాయలను జీరోకు తీసుకురాగలిగామన్నారు. సహకార బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి టాస్క్‌ఫోర్స్ అర్బన్ బ్యాంకుల ఏర్పాటులో ఆంజనేయులు కృషి శ్లాఘనీయమన్నారు. విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ రూ.1200కోట్లు ప్రభుత్వానికి పెట్టుబడి పెట్టడం జరిగిందన్నారు. దీనిపై నామమాత్రంగా ఆరు శాతం వడ్డీ వస్తుందన్నారు. ఈ ఏడాది మరో ఐదు నూతనంగా బ్రాంచ్‌లను ప్రారంభించామన్నారు. జోనల్ మేనేజర్ ఎస్ఎస్ఆర్ మూర్తి, డైరెక్టర్లు ఆచార్య ఎస్.అంజయ్య, బ్రాంచ్ మేనేజర్ వీరవల్లి బంగారు బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ మూర్తి, తదితరులు

ముమ్మరంగా వాహన తనిఖీలు

చిలకలూరిపేట: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కేఎల్ రావు హెచ్చరించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరిగిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలపై రవాణా, పోలీసుశాఖల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో భాగంగా 75 వాహనాలను పరిశీలించి 18 వాహనాలపై కేసులు నమోదు చేశారు. వీటికి సంబంధించి రూ. 91,720 అపరాధ రుసుము వసూలు చేశారు. ఐదు వాహనాలను సీజ్ చేసి ఆర్టీసీ డిపోకు తరలించారు. ఈ సందర్భంగా కేఎల్ రావు మాట్లాడుతూ ప్రమాదాలు పెరిగిన నేపథ్యంలో తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని వెల్లడించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేయక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం రాంబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కేసులు నమోదు చేస్తున్న ఎంవీఐ కేఎల్ రావు

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ దుర్మరణం

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ దుర్మరణం పాలైన ఘటన గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో చిలకలూరిపేట బ్యాంక్ ఆఫ్ బరోడా సెంటర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన జగ్గరపు సంజయ్ (21) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తుంటాడు. గురువారం పగలు వివాహ వేడుకకు హాజరై రాత్రి సమయంలో చిలకలూరిపేట జాతీయ రహదారిపై బ్యాంక్ ఆఫ్ బరోడా జంక్షన్‌లో వాహనాన్ని తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఎదిగొచ్చిన కుమారుడు మృతి చెందాడన్న సమాచారంతో తల్లిదండ్రులు కోటేశ్వరరావు, ధనలక్ష్మి తల్లడిల్లారు. గత కొన్నేళ్లుగా కోటేశ్వరరావు పెరాలసిస్ వ్యాధితో బాధపడుతుండగా, తల్లి ధనలక్ష్మి ఇంట్లోనే కుట్టుమిషన్ కుడుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. మృతుడు సంజయ్ ఇంటర్ పూర్తయ్యాక ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. సంజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలించారు.



మృతుడు సంజయ్ (ఫైల్)

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కొంత మందిని గురజాల నియోజకవర్గంలో నియామకాలు చేస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురజాల నగర పంచాయతీ అధ్యక్షుడిగా కుక్కముడి అంకారావు, గురజాల మండల అధ్యక్షుడిగా కొమ్మినేని వెంకటేశ్వర్లు, మాచవరం అధ్యక్షుడిగా మద్దు ప్రసాద్, పిడుగురాళ్ల రూరల్ మండల అధ్యక్షులుగా చింతా వెంకటసుబ్బారెడ్డి నియమితులయ్యారు.

పలు దుకాణాల్లో తూనికలు, కొలతల అధికారులు తనిఖీ

సత్తెనపల్లి: పట్టణంలోని పలు దుకాణాల్లో తూనికలు కొలతలు శాఖ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ షేక్ సైదా శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రెండు దుకాణాల్లో ఎమ్మార్పీకి మించి విక్రయిస్తున్నారని, ఒక దుకాణంలో ప్యాకింగ్‌పై చిరునామా, తేదీ, అడ్రస్ లేవని గుర్తించారు. మొత్తం నాలుగు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా షేక్ సైదా మాట్లాడుతూ వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా చిరునామా, తయారీ తేదీ, గడువు ముగిసే తేదీని తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. మోసం చేశారని చేశారని గ్రహిస్తే తూనికలు, కొలతలు శాఖ అధికారులకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సత్తెనపల్లి: మద్యం వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. విజయ్ కుమార్ తెలిపారు. మద్యం షాపుల సమయపాలనపై శుక్రవారం పెట్రోలింగ్, ఎమ్మార్పీ ధరలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ సత్తెనపల్లి టౌన్, రూరల్, ముప్పాళ్ల, రాజుపాలెం మండలాల పరిధిలోని ప్రైవేటు మద్యం షాపుల నిర్వాహకులు సమయపాలన పాటించాలని చెప్పారు. ఎమ్మార్పీకి మించి అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ కె. నాగలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

సత్తెనపల్లి: యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం అవుతాయని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనంద్‌కుమార్ అన్నారు. యోగాంధ్ర-2025లో భాగంగా పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో వార్డు సచివాలయ సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యోగా శరీరం, మనసు, భావోద్వేగం, శక్తి స్థాయిపై పని చేస్తుందని తెలిపారు. యోగాంధ్ర-2025కు సంబంధించి వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే రిజిస్ట్రేషన్లు ఈనెల 25 సాయంత్రంలోపు పూర్తి చేయాలని ఆయన సూచించారు. సచివాలయం పరిధిలోని ప్రజలకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి, ఇన్‌చార్జ్ మున్సిపల్ మేనేజర్ సుభాని పాల్గొన్నారు.

రేషన్ కార్డులపై క్షేత్రస్థాయి పరిశీలన

యడ్లపాడు: మండల తహసీల్దార్ జెట్టి విజయశ్రీ గురువారం యడ్లపాడు-1 సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియపై అక్కడి సిబ్బందితో సమావేశమై దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, అర్హత నిర్ణయం తదితర ప్రక్రియలను సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేయాలని, అనర్హుల వద్ద నుంచి పథకాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉందన్న విషయాన్ని విస్మరించ వద్దన్నారు. రేషన్ కార్డుల మంజూరుపై సిబ్బందికి స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఆమె వెంట ఉప తహసీల్దారు అనురాధ, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సుబ్బారావు, వీఆర్వో కేపీచారి, పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-6 స్వాతిప్రియ, జీఎంఎస్‌కే రేవతి ఉన్నారు.

మాజీ సర్పంచి సేవలు అభినందనీయం

నూజెండ్ల: మండలంలోని ములకలూరు గ్రామంలో మాజీ సర్పంచ్ దివంగత నేత కంచర్ల పెద సుబ్బారావు వర్ధంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కంచర్ల పెద సుబ్బారావు విగ్రహా ఆవిష్కరించి పూల మాలల వేసి ఘననివాళులర్పించారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

రెంటచింతల: ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తన శుద్ధి చేయడం వలన చీడపీడల నుంచి పంటలను రక్షణ ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పును కలిపి ఎంపిక చేసుకున్న వరి విత్తనాలను పోయగా పైకి తేలిన తాలు విత్తనాలను తీసివేసి నీటి అడుగున మునిగి ఉన్న గట్టి విత్తనాలను నారు పోసుకోవడానికి వాడుకోవాలని చెప్పారు. కిలో వరి విత్తనానికి ఒక లీటరు నీటిలో 2.5 గ్రాముల కార్బండజిమ్ కలిపి 24గంటలు నానబెట్టిన అనంతరం మరో 20 నుంచి 24గంటల పాటు మంచి నీటిలో విత్తనాన్ని ఉంచి తరువాత నారు మడులలో చల్లుకోవాలన్నారు. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ళు నివారణ కోసం కిలో విత్తనానికి 3గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. నారుమడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వ పురుగు సోకకుండా ఉండటానికి మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లేముందు 0.2 శాతం క్లోరిపైరిఫాస్ ద్రావణంలో నానపెట్టి చల్లు కోవాలన్నారు. ఒక కిలో పత్తి విత్తనాన్ని 8 గ్రాముల ట్రికో డెర్మావిరిడితో, ఒక కేజి మిరప విత్తనాన్ని 8 నుంచి 10 ఎంఎల్ గౌచో ద్రావణంలో విత్తన శుద్ధిచేయడం మంచిదన్నారు. పత్తి చుట్టూ అంతరపంటగా 4 సాళ్లకు ఒక సాలుకు కంది, మినప, పెసర పంటలను సాగుచేసు కోవడం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. మాగాణి చుట్టు గట్టుపై కందిపంటను రైతులు అంతర పంటగా సాగుచేయడం వలన రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు.



మాట్లాడుతున్న ఏఓ బ్రహ్మారెడ్డి

వైభవంగా వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

మాచర్ల: పాతమాచర్లలోని లక్ష్మీమ సమేత వేంకటేశ్వర స్వామి గోదాదేవి ఆలయంలో గురువారం నాలుగవ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు చలమాచలం భరద్వాజా చార్యులు, సీతారామనుజాచార్యులు నిర్వహించారు. శుక్రవారం స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అన్న సంతర్పణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పాల్గొని ప్రారంభించారు. శనివారం స్వామికి ఊయల సేవతో కార్యక్రమాలు ముగిస్తాయని ఆలయ అధ్యక్షుడు ఉప్పుతోళ్ల గోవిందరాజులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కామనబోయిన కోటయ్య, ఉప్పుతోళ్ల ఏడుకొండలు, ఉప్పుతోళ్ల ఏడుకొండలు, కొమర శ్రీనివాసరావు, ఓరుగంటి చెన్నకేశవరావు, ఉప్పుతోళ్ల చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది.



ఉత్సవ విగ్రహాలతో ఆలయ కమిటీ సభ్యులు

స్వయం ఉపాధితోనే స్త్రీ శక్తి

వెల్దుర్తి: స్వయం ఉపాధితోనే సమాజంలో స్త్రీ శక్తి బలపడుతుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళలకు అనేక రకాల కోర్సులు అందించి వారి కుటుంబాల అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. ఆర్థిక స్వావలంబన సాధికారిత చేకూర్చినప్పుడే మహిళలు సమాజంలో ఎదుర్కొంటున్న వివక్షను అధిగమించగలరని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళా లోకం ఆర్థికంగా పురోగమించేందుకు కూటమి ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను శ్రీకారం చుడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.ప్రసాద్, టీడీపీ నాయకులు జె.అక్కిరెడ్డి, వజ్రం నాయక్, కేశిరెడ్డి హనిమిరెడ్డి, దేశం శ్రీనివాసరెడ్డి, పులుసు శివారెడ్డి, జూలకంటి జయరామిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేబీఆర్

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల

చిలకలూరిపేట: ఉపాధి హామీ కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల డిమాండ్ చేశారు. మండలంలోని వేలూరు గ్రామంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలను శుక్రవారం కలసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు ప్రారంభించి రెండు నెలలు కావస్తున్నా పనిచేసిన కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం దురదృష్టకరమన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం ప్రతి 15 రోజులకు ఒకసారి వేతనం, పే స్లిప్ చెల్లించాలని స్పష్టంగా ఉన్నప్పటికీ దానిని అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలైన టెంట్, మంచి నీరు, మజ్జిగ వంటి సౌకర్యాలు ఏ మాత్రం కల్పించటం లేదని ఆరోపించారు. ఏడేళ్ల కిందట ఇచ్చిన పని ముట్లతోనే నేటికి పనిచేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఒక్కో కుటుంబానికి ఏడాదికి 150 రోజులు పని కల్పించాలని, రోజు కూలీ కింద రూ. 600 చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో వేసవి ఎలవెన్స్ పెంచి చెల్లించేవారని, ప్రస్తుతం ఎటువంటి వేతనాలు పెంచలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చౌటుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మహిళా సమాఖ్య కార్యదర్శి నిర్మల

ప్రతిరోజు యోగాతో ప్రశాంత జీవితం

శివప్రసాద్ గురూజీ

చిలకలూరిపేట టౌన్: ప్రతిరోజు యోగ సాధన వల్ల మనకు మానసిక ప్రశాంతత, ఆత్మస్థైర్యం మాత్రమే కాదు, రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది అని ప్రముఖ యోగ గురువు కాపుగంటి శివప్రసాద్ గురూజీ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సాధినేని చౌదరయ్య స్కూల్‌లో నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం 79వ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి శిఖాకొల్లి రాంబాబు గురూజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ గురూజీ మాట్లాడుతూ, శిక్షణ పొందిన సాధకులు ప్రతి రోజు క్రమంగా యోగాసనాలు, ధ్యానం చేస్తూ జీవితాన్ని మరింత ఆరోగ్యకరంగా, ధైర్యంగా మార్చుకోవచ్చు అన్నారు. గత 28 రోజుల శిక్షణ ద్వారా తమ శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడిందని సాధకులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం యోగాగురువులు శివప్రసాద్, రాంబాబులకు దుశ్శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో యోగ శిక్షణ సాధకులు హాజరయ్యారు.

రేపు గణపవరంలో లింగధారుల సమ్మేళనం

నాదెండ్ల: గణపవరం శివనాగేంద్రస్వామి దేవస్థానం ఆవరణలో ఈ నెల 25 ఆదివారం లింగధారి సర్వతో ముఖాభివృద్ధి సమితి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా లింగధారుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు స్టీరింగ్ కమిటీ సభ్యులు కొల్లిపర పూర్ణచంద్రరావు, సిద్ధాంజనేయ చెప్పారు. ఉదయం 10.30 గంటలకు ఉమామహేశ్వర వ్రతం, ఆది జగద్గురువులు బసవాది జయంతి పూజా కార్యక్రమాలు ఉంటాయి.